వస్తాడు అన్నాడు మామయ్య.

"మరయితే డబ్బేనా కట్టి అప్లికేషను పడేశావు కదా! ఎగ్మూరు పోయి ఆ రామయ్యగారిక్కూడా ఓసారి కనుపించు, దర్శనం చేసి బతిమాలితే ఏదైనా సాయం చేస్తాడాయన."

ఎగ్మూరు వెళ్ళి రామయ్యని చూడాలని లేనే లేదు మూర్తికి. మైలాపూర్ పోయి మోహిని కనిపిస్తుందేమో చూడాలని వుంది.

"సరే" అన్నాడు.

రెండేళ్లు కష్టపడి చదివి స్కూల్ ఫైనల్ సాధించి ఇంటర్మీడియేట్ చదువుదామని ఉబలాటపడుతూవుంటే, "మీ మావఁ దగ్గరకి పోతే అతను ఏదయినా ఉద్యోగం ఇప్పిస్తాడు. వెళ్లు వెళ్లు, మద్రాస్ వెళ్ళు" అన్నాడు నాన్న.

దాంతో పై చదువుకి వెళ్దామన్న సరదా అలానే ఉండిపోయింది. మద్రాస్, చూద్దామనే సరదాతో మద్రాస్ వస్తే వచ్చీ రావడంలో ఆ సరదా తీరిపోయింది.

పాతమాంబళంలో పగలే చీకటిగా ఉండే గదిలో కూర్చొని "ఛీ, పాడు వూరు. పాడు వెధవ్వూరు. పనికిమాలిన వూరు" అని మద్రాస్‌ని నిందించుకున్నాడు మూర్తి.

ఇంతవూళ్ళోనూ యాభైయూపాయీ లిచ్చే ఉద్యోగంకూడా దొరకదు. దొరికినా, ఆ జీతం బతకడానికి చాలదు. అదయినా లక్షాయాభైమంది కాళ్లు పట్టుకొంటేనేగాని దొరకదు. కాళ్ళు బట్టుకోడానికి రోజుకి అథమం పది మైళ్లయినా తిరిగి తిరిగి చావాలి.

ఎగ్మూరు వెళ్తానని చెప్పి మైలాపూర్‌కి బయల్దేరిన మూర్తి "ఛీ! పాడువూరు అనుకోలేదు.

ఉద్యోగంలేదు సరే. కాని, వూరంత పాడుగాలేదు.

మాంబళం బస్ టెర్మినస్‌దగ్గర కాఫీహోటేళ్లోకి చకచకా పోతున్నాయి రెండు సిల్కుచీరలు.

"పొడుగుటావిడ మోహిని కాదుకద" అని పరిశీలించి చూసేడు. ఆవిడ మోహిన్లా లేదు. ఆవిడ మోహిని కాదు.

